# ఓ అక్రమార్జనా!

(అక్రమార్జన, అక్రమార్జన సంస్కృతిపై చర్చాగోష్టికి
మౌలికమైన ఆలోచనలు)

రచన

**ఉప్పల గోపాలరావు**

ప్రచురణ

**ప్రజా ఆలోచనా వేదిక**

ఫ్లాట్ నెం. 5,
స్వగృహ అపార్ట్‌మెంట్ - బ్లాక్-సి,
భాగ్యనగర్‌కాలనీ, కూకట్‌పల్లి,
హైదరాబాద్-500 072, ఏ.పి. ఇండియా

ఫోన్: 23067399. సెల్ - 94400 53099

# ఓ అక్రమార్జనా!

## ఇందులో.......


| | | పేజీ |
|---|---|---|
| 1. | అక్రమార్జన | -- 3 |
| 2. | అక్రమార్జన సంస్కృతి పై ఒక నోట్ | -- 7 |
| 3. | అక్రమార్జన–అక్రమార్జన సంస్కృతి | -- 8 |
| 4. | అభివృద్ధి–అక్రమార్జన–అంతరాలు–ప్రజాస్వామ్యం | -- 13 |
| 5. | అక్రమార్జన విషసంస్కృతిని అదుపుచేయాలి. | -- 15 |
| 6. | ప్రజాస్వామ్యపాలన–అక్రమార్జన–అక్రమార్జన సంస్కృతి ఫ్యూడల్ భావజాలం–ఉద్యమాలు | -- 18 |
| 7. | నీతి | -- 23 |
| 8. | నిజాయితి | -- 26 |
| 9. | అభివృద్ధి కార్యక్రమాలు, అక్రమార్జనకు సోపానాలా? | -- 29 |
| 10. | ఎన్నికలు– అక్రమార్జన సంస్కృతి | -- 32 |
| 11. | అవసరాలు–వనరులు–విలువలు–సంస్కృతి | -- 35 |
| 12. | అక్రమార్జన విష వృక్షాన్ని పెకిలించేది ఎలా ? | -- 37 |


**అంకితం**

నా ఆలోచనలకు పదును పెట్టటంలో సహకరిస్తున్న
నా ప్రియమైన అర్ధాంగి
సరోజినికి...

**ఓ అక్రమార్జనా!**

మొదటి ముద్రణ - ఫిబ్రవరి 2007.

రెండవ ముద్రణ - ఆగష్టు 2008

మూడవ ముద్రణ - అక్టోబర్ 2010

నాల్గవ ముద్రణ - నవంబర్ 2011

సర్వ హక్కులు రచయితవి

వెల - మీ నిర్ణయం - రచయిత అడ్రసుకు సంప్రదించండి.

డీ.టి.పి. & ముద్రణ :

**రెయిన్‌బో ప్రింట్ ప్యాక్**

అమీర్‌పేట్, హైదరాబాద్ - 16

ఫోన్ : 040-23731620, 23741620

# ఓ అక్రమార్జనా!

**ఓ అక్రమార్జనా!**

అనాదినుండి నీ బలం పెరుగుతూనే వుంది,
నీ పెరుగుదల ప్రమాదం అని
మానవ సమాజం గుర్తించ లేకపోయింది.

నీవే సృష్టించావు ఆనాటి ఆటవిక బానిస వ్యవస్థ,
నీవే ఫ్యూడల్ వ్యవస్థకు కారణం,
రాజులకూ, రారాజులకు అండగా వున్నావు,
జమిందారులకూ, భూస్వాములకు కాపలా కాచావు.

నేటి పెట్టుబడిదారీ వ్యవస్థ
నిన్ను బాగా పెంచి పోషిస్తున్నది.
నేడు సృష్టిస్తున్నావు
ఆధునిక బానిస వ్యవస్థను.
ఓ అక్రమార్జనా
ఆదర్శవాదాలను, ఇజాలనూ,
ఎన్నో నిజాలను అణగదొక్కేశావు,
ఈ నాటి ప్రజాస్వామ్య వ్యవస్థలో నీవే రాజువైనావు.

నేడు పేరుకే ప్రజాస్వామ్యం,
సామాన్య ప్రజల మాట సాగదు ఈ ప్రజాస్వామ్య పాలనలో,
సామాన్య ప్రజలదే మెజారిటీ అయినా
పాలకవర్గాలలో వారి జాడ కనపడదు,
అక్రమార్జనపరులదే ఈనాటి ప్రజాస్వామ్య పాలన,
ప్రభుత్వాలన్నీ ఏర్పడేది, అక్రమార్జనపరుల అండదండలతోనే,

అందుకే
ఈ నాటి ప్రభుత్వ పాలన
అక్రమార్జన పరులకు అండగా నిలుస్తుంది.

హింసను పెంచింది అక్రమార్జనే,
విలువలను చంపింది అక్రమార్జనే,
సమాజములో శాంతి భద్రతల సమస్యలను
సృష్టించేది అక్రమార్జనే,
ప్రజా సంస్కృతిని పాడు చేసింది అక్రమార్జనే,
ఆధ్యాత్మిక రంగాన్ని అధోగతి పట్టించింది అక్రమార్జనే,
రాజకీయ రంగాన్ని కలుషితం చేసింది అక్రమార్జనే,
పాలనా రంగాన్ని పాడుచేసింది అక్రమార్జనే,

అక్రమార్జనపై,
ప్రజాపోరాటాలు రాకుండా
ప్రజలలో కుల పిచ్చి పెంచింది,
మతోన్మాదం పెంచింది అక్రమార్జనే,

**ఓ అక్రమార్జనా!**

నీవే అరాచక సంస్కృతికి అండగా నిలిచావు నేడు
అన్యాయాలు, అక్రమాలు నీ మూలాన జరుగుతున్నా,
నిన్ను అరికట్టటంలేదు ఈ పాలక వర్గాలు,
నీ బలమే వారికి అండ గాబట్టి,

అందరూ అంటూ వుంటారు.
సమాజం రోజు రోజుకూ చెడిపోతుందనీ
కానీ! కారణం నీవని చాలామందికి తెలియదు.

అందరూ అనుకుంటూవుంటారు.
మంచిరోజులు రావాలని
మంచికాలం చూడాలని,
ఈ వ్యవస్థ మారాలని,
కాని
మంచికాలం ఎందుకు రావటంలేదో,
ఎందుకు ఈ వ్యవస్థ మారటంలేదో
ఎవ్వరూ లోతుగా ఆలోచించరు.
అక్రమార్జనను అదుపు చేస్తూ పోతే,
మంచి రోజులొస్తాయని,
మంచికాలం వస్తుందని
ఎందరికి తెలుసు?
నేడు సమాజం ఎదుర్కొంటున్న సమస్యలలో సగానికి పైగా,
అక్రమార్జనే కారణం అనే సంగతి ఎందరికి తెలుసు?

నీ సంగతి,
నీ పుట్టుపూర్వోత్తరాలు,
సమాజంలో నీ పాత్ర,
పాలకవర్గాలమీద నీ అదుపు,
ప్రజాస్వామ్య ఎన్నికలలో నీ పెత్తనం,
అన్ని పాలకవర్గ పార్టీలు నీ చేతిలో కీలుబొమ్మలనే సంగతి,
ప్రభుత్వాలను పరోక్షంగా
నీవే నడుపుతున్నావనే సంగతి, ఎందరికి తెలుసు?

ప్రజలందరూ తెలుసుకున్ననాడు,
ఓ అక్రమార్జనా! నీ సంగతి ప్రజలందరూ తెలుసుకొన్ననాడు
తెలుసుకొని-నిన్ను అదుపు చేయటానికి ఉద్యమించిననాడు,

నిన్ను పూర్తిగా అదుపుచేసిననాడు,
సమాజంలో మంచి పెరిగే మాట నిజం
అశాంతి–అభద్రతా భావం – బతుకు భయం
సమాజానికి దూరమయ్యే మాట నిజం,
న్యాయమైన పాలన, నీతి, నిజాయితీలు
సమాజంలో పెరిగే మాట వాస్తవం,
కష్టపడే మనిషి కమ్మగా బతికే వాతావరణం
సమాజంలో ఏర్పడే మాట నిజం
మంచి పాలన సాగే మాట నిజం,
ఎన్నికలలో జరిగే అరాచకాలు అరికట్టబడే మాట నిజం,
నిజమైన ప్రజాస్వామ్యానికి బలం చేకూరే మాట నిజం.

**కాని,**

ప్రజలు నీ నిజస్వరూపం తెలుసుకోనంతవరకు
నిన్ను గురించి లోతుగా ఆలోచించనంతవరకూ

**ఓ అక్రమార్జనా**

నీవు సాగించుకుంటూనే వుంటావు
నీపెత్తనం ఈ రాజ్యంలో
ఈ ప్రజాస్వామ్య ముసుగులో.

# అక్రమార్జన సంస్కృతి

పై ఒక నోట్

అక్రమార్జన అంటే ఏమిటి? అక్రమార్జన సంస్కృతి అంటే ఏమిటి? అతి ప్రమాదకరమైన అక్రమార్జన, ప్రమాదకరమైన అక్రమార్జన, నష్టాన్ని కష్టాన్ని కలుగ జేస్తున్న అక్రమార్జన, చికాకు కలుగ జేస్తున్న అక్రమార్జన, సమాజానికి ప్రమాదం లేని అక్రమార్జన, సమాజానికి వుపయోగపడే అక్రమార్జన ఏ ఏ రూపాలలో ఉన్నవి?

హింసను పెంచుతున్న అక్రమార్జన, విలువలను చంపుతున్న అక్రమార్జన, సత్యాన్ని, ధర్మాన్ని, న్యాయాన్ని, ధ్వంసం చేస్తున్న అక్రమార్జన,। అక్రమాలను, అన్యాయాలను, అరాచకాలను, అల్లర్లను, దౌర్జన్యాలను, విధ్వంసాలను పెంచి పోషిస్తున్న అక్రమార్జన!

రాజకీయ పార్టీల మీద, ఎన్నికల, ఓట్ల ప్రక్రియ మీద నేటి అక్రమార్జన ప్రభావం ఏ రూపంలో ఉన్నది?

ప్రజాస్వామ్యాన్ని బలహీన పరుస్తున్న అక్రమార్జన మార్గమేమిటి? అక్రమార్జన సంస్కృతి ప్రజాస్వామ్యాన్ని ఒక బూటకంగా తయారు చేసిన మాట నిజమా, కాదా?

నేటి ఎన్నికల ప్రక్రియను, అక్రమార్జన పరులు తమ ఓట్ల ఆటగా మార్చిన మాట నిజమా, కాదా?

మతమౌఢ్యాన్ని పెంచింది. కులతత్వాన్ని పెంచింది అక్రమార్జన సంస్కృతి అవునా, కాదా?

అక్రమార్జన సంస్కృతి మీద చర్చాగోష్టులు, సదస్సులు పెద్దఎత్తున జరగాల్సి ఉన్నమాట నిజంకాదా?

# అక్రమార్జన-అక్రమార్జన సంస్కృతి

**అక్రమార్జనే,**

ఆధునిక బానిస సమాజాన్ని సృష్టించింది.
సమాజంలో ధైర్యాన్ని అణచివేసింది.
త్యాగాన్ని రూపుమాపింది.
కష్టపడే తత్వాన్ని తగ్గించింది.
క్రమశిక్షణ లేకుండా చేసింది.
భాధ్యతను విస్మరింప చేసింది.
ప్రాణాంతకమైన కల్తీలను, నకిలీలను పెంచి పోషిస్తున్నది.
మోసాలను పెంచింది. మాయలను పెంచింది.
నీజాయితీని చంపింది.
అభివృద్ధి ఫలితాలను, ఆధునిక సౌకర్యాలను,
నిజం డబ్బుకు అందకుండా చేసింది.
పన్నుల భారం పెంచింది. ధరల పెంపుకు కారకురాలైంది.
అంతులేని ఆర్థిక వ్యత్యాసాలకు దారితీసింది.
చదువు ఖరీదు పెంచింది.
వైద్యం ఖరీదు పెంచింది.
ఆధ్యాత్మిక రంగాన్ని శాసిస్తున్నది.
పాలనా రంగం మీద పెత్తనం చేస్తున్నది.
ప్రభుత్వ సైన్యాలను పరోక్షంగాను,
ప్రైవేట్ సైన్యాలను ప్రత్యక్షంగా పోషిస్తున్నది.
బలమైన మతాన్ని, కులాన్ని, దేవుడిని తన ప్రక్కకు లాక్కున్నది.
సాంస్కృతిక రంగాన్ని,
సాహిత్య రంగాన్ని బలహీనతలకులోను చేసింది.
సినిమా రంగాన్ని తన వడిలో పడుకో బెట్టుకున్నది.

పరిమిట్ల, కోటాల, లైసెన్స్ రాజ్యాన్ని విస్తరింపచేసింది.
ఛాన్స్‌ల రాజ్యాన్ని, లాటరీల రాజ్యాన్ని పెంచి పోషిస్తున్నది.
పారిశ్రామిక రంగంలో బలంగా ప్రవేశించింది.
వ్యాపార రంగాన్ని తన అధీనం చేసుకున్నది.
కాంట్రాక్టుల రంగాన్ని కలుషితం చేసింది.
స్మగ్లింగు, మత్తు పదార్థాల వ్యాపారంతో బలిసిపోయింది.

ఈ అక్రమార్జన సంస్కృతి సమాజంలో పాకని, తాకని రంగం అంటూ లేదు. ప్రజా ఉద్యమాలపై కూడా కనపడని పెత్తనం కొనసాగిస్తున్నది. సమాజం ఎదుర్కొంటున్న సమస్యలలో నూటికి ఎనభై సమస్యలకు అక్రమార్జన సంస్కృతే కారణం.

ఈ సంస్కృతి కలగజేస్తున్న ప్రమాదకరమైన పరిస్థితిని గురించి ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు స్పందించి దీనిని అరికట్టడానికి ప్రయత్నం చేయకపోతే మన సమాజం ఒక పెద్ద అగాధంలో పడక తప్పదు.

ఈ అక్రమార్జన సంస్కృతి వలన బాధపడుతున్న మెజారిటీ జనం కదిలితే గాని ఈ దుష్ట సంస్కృతిని అరికట్టలేము.

ఫ్యూడల్, బానిస, రాజరికపు, భూస్వామ్య వ్యవస్థల కంటే, నేటి బూటకపు ప్రజాస్వామ్య వ్యవస్థలో అక్రమార్జన సంస్కృతి బలం పుంజుకొని, సమాజానికి ఎన్నడూ లేనంత ప్రమాదకరంగా మారింది.

అక్రమార్జన అండతో ప్రజాస్వామ్యం ముసుగులో ప్రభుత్వాలు ఏర్పరుచుకొన్న ఈనాటి పాలకులు, అక్రమార్జన సంస్కృతిని పెంచి పోషిస్తున్నారు, ప్రజలకు అవసరాలు పెంచుతున్నారు. వనరులు మాత్రం అందకుండా చేస్తున్నారు. సమాజంలో ప్రతివారిలో ఆశ,

భ్రమ, అయోమయం, భయం మొలకెత్తిస్తున్నారు. ఛాన్సుల కోసం ఎదురు చూసే లాటరీ మనస్తత్వం పెంచారు.

అక్రమార్జన సాంస్కృతిక భవనానికి ప్రజలనే కాపలా పెట్టగలిగారు.

అన్యాయాలు, అక్రమాలు చేసేవారికి కమ్మని బతుకుకు కొదవలేదు.

నీతికి, నిజాయితీకి, చట్టాలకు శాసనాలకు కట్టుబడి జీవించేవారికి అన్నీ కష్టాలే. అవన్నీ అతిక్రమించే వారికి, అన్నీ సుఖాలే.

**ఏమిటీ ఈ అన్యాయం ?**

**ఎక్కడుంది దీని కిటుకు ?**

**దీనికి కారణం ఏమిటి ?**

**దీనికి పరిష్కార మార్గమేమిటి ?**

**పరిష్కార మార్గం అక్రమార్జనపరుల చేతులలో ఉందా ?**

**మన రాజ్యం అక్రమార్జనపరుల అండతో నడుస్తున్నదా, లేదా ?**

**ఇక అక్రమార్జన సంస్కృతి వలన నష్టపడుతున్న అనేక సమస్యలతో సతమతమవుతున్న ప్రజలను ఎవరు ఆదరిస్తారు ?**

**అక్రమార్జన లేని మెజార్టీ సామాన్య జనం వారి సమస్యలను ఎవరితో చెప్పుకోవాలి? ఎవరు తీరుస్తారు ?**

**చెప్పించుకొనేవారు, వినేవారు, తీర్చేవారు, అందరూ అక్రమార్జన పరులే అయినప్పుడు ఈ సమస్యను ఎవరు తీరుస్తారు?**

సమాజంలో, సామాన్య జనం కష్టాలు, అక్రమార్జన సంస్కృతికి ముడిపడివున్నాయి.

అక్రమార్జన సంస్కృతిని తొలిగించటానికి ఈ పాలకవర్గాలు పూనుకోవు. ఇక అక్రమార్జన సంస్కృతిని అరికట్టడానికి సామాన్య ప్రజలే నడుముకట్టాలి.

కాని అక్రమార్జన ఊబిలోనికి నెట్టబడిన సామాన్య జనాన్ని బయటికిలాగి ఉద్యమింపచేసేది ఎవరు? ఇదే ఈనాటి సమాజం ముందున్న ప్రశ్న !!

సమాజం నుండి అక్రమార్జన సంస్కృతిని తొలగించడానికి నేటి ప్రజాస్వామ్యంలో, పారదర్శకత, జవాబుదారీతనం, లెక్కలు చూపించే విధానం, అనే స్లోగన్లే అయుధాలుగా ఉపయోగించుకోవాలి.

సమాచార హక్కు చట్టం, ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ టెక్నాలజీని అక్రమార్జన సంస్కృతిని అరికట్టడానికి ఉపయోగించుకోవాలి.

సంపాదన తప్పుకాదు.
ఎవరైనా వారి శక్తి మేరకు సంపాదించు కోవచ్చు.
సంపాదించు కోవడానికి అభ్యంతరం లేదు.

కాని ఆ సంపాదించిన విధానం, సంపాదించిన ఆస్తి, సమాజానికి, బహిరంగ పరచటం అనే సామాజిక, ఆర్థిక బాధ్యతకు వారు కట్టుబడి ఉండాలి. అదే సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం. ఏ వ్యక్తి అయినా తన శక్తి సామర్థ్యాలతో పాటు ప్రజలు, ప్రకృతి, రాజ్యం సహకరిస్తేనే సంపాదించుకోగలిగేది. అందుకే, రాజ్యానికి, ప్రజలకు జవాబుదారీగా ఉండాలి.

## అభివృద్ధి పేరుతో అక్రమార్జన పెరిగిన మాట నిజం

**మన సమాజంలో**

అక్రమార్జనను అరికట్టకపోతే పేదరికం పోదు.
ఆర్థిక వ్యత్యాసాలు సమాజంలో విపరీతంగా పెరిగిన మాట నిజం.
అభివృద్ధి ఫలితాలు అందరికీ అందుబాటులోనికి రావు.
దాని వలన సమాజానికి చేటు తప్పదు.
ప్రజాస్వామ్యం ఒక బూటకం అనేమాట నిజం అవుతుంది.
శాంతిభద్రతల సమస్య శాశ్వతంగా ఉండే మాట నిజం.
విలువల పతనం తప్పదు.
నేడు ఈ లక్షణాలు మన సమాజం ముందు నాట్యం చేస్తున్నవి.

నేడు సమాజాన్ని పట్టి పీడుస్తున్న పెద్ద జబ్బు ఈ అక్రమార్జనే, దానికి వెంటనే వైద్యం చేపట్టాలి. ఇప్పటికే ఆలస్యం అయ్యింది. అందుకు ప్రజా వైద్యులైన రచయితలు, అక్రమార్జన సంస్కృతి ఏ ఏ రంగాల మీద ఎలా విష సంస్కృతిని వివరింపజేస్తున్నది, దాని వలన జరుగుతున్న పరిణామాలను, నాటికల ద్వారా, నాటకాల ద్వారా, కవితల ద్వారా, రచనల ద్వారా, చర్చాగోష్టుల ద్వారా, సదస్సుల ద్వారా ప్రజలకు అందజేయాలని విజ్ఞప్తి.

సమాజంలో శాంతి కావాలనే వారు,
భద్రత కాపాడబడాలనే వారు,
ప్రశాంతత కోరుకునేవారు,
న్యాయం, ధర్మం, సత్యం కాపాడబడాలని కోరుకొనేవారు,
భారతీయ సంస్కృతిని కాపాడబడాలని కోరుకొనేవారు, ఈ అక్రమార్జన సంస్కృతిని గురించి ఆలోచనలు కొనసాగించి, చర్చాగోష్టులు నిర్వహించి, అభివృద్ధి ముసుగులో అక్రమార్జన సంస్కృతిని తొలిగించడానికి పరిష్కార మార్గాలను అన్వేషించవలసిందిగా సామాజిక స్పృహ గల ఆలోచనాపరులందరికీ మనవి.

## అభివృద్ధి-అక్రమార్జన-అంతరాలు-ప్రజాస్వామ్యం

### అభివృద్ధికి ఆటంకం ఎవరు? అసలు అభివృద్ధి అంటే ఏమిటి?

- నిజమైన అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం ఎవరైనా కలగచేస్తారా?
- ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్ఠ పరచటం కూడా అభివృద్ధిలో బాగం కాదా?
- అభద్రతా భావం ప్రజలలో తొలిగించటం, అభివృద్ధిలో భాగం కాదా?
- హింసావాతావరణం సమాజంలో అరికట్టటం, అభివృద్ధిలో భాగం కాదా?
- మానవ సంస్కృతిని మంచి మార్గములో మలచటం, అభివృద్ధిలో భాగం కాదా?
- కల్తీలను, నకిలీలను అరికట్టటం, అభివృద్ధిలో భాగం కదా?
- అభివృద్ధి కార్యక్రమాలలో అక్రమార్జన సంస్కృతిని ప్రశ్నించటం, అభివృద్ధి కార్యక్రమాలను ఆటంకపరచటమేనా?
- అన్యాయాలను, అక్రమాలను ప్రశ్నించే శక్తి ప్రజలకు కలగ చేయటం ప్రజాస్వామ్యంలో అభివృద్ధికి చిహ్నం కాదా?
- అభివృద్ధి కార్యక్రమాల ముసుగులో పెరిగిన అక్రమార్జన, ప్రజాస్వామ్య ప్రక్రియకు ప్రమాదంగా తయారైన మాట నిజమా, కాదా?
- ప్రభుత్వ పోలీసు బలగాలకన్నా, అక్రమార్జన పరులు పెంచి పోషిస్తున్న ప్రైవేటు సైన్యాలు బలంగా వుండటానికి, ప్రజల్ని భయ పెట్టటానికి కారణాలేమిటి?
- పారదర్శకత, జవాబుదారీతనం, ప్రతివిషయాన్ని గురించి సమాచారం అడిగి తెలుసుకోవటం, ఈనాటి ప్రజలు ఉపయోగించుకునే ప్రజాస్వామ్య ఆయుధాలు కావా? ఈ ఆయుధాలను ఉపయోగించుకునే హక్కు ప్రతి పౌరునికి ఉండాలా? అక్కరలేదా?

- అభివృద్ధి వేగం అనర్థాలకు దారితీయటం లేదా? పనులలో నాణ్యత లోపాలు పెరగటం అభివృద్ధికి చిహ్నమా?
- అభివృద్ధి కార్యక్రమాలు అసలు ఎవరి కోసం? అక్రమార్జన పరుల కోసమేనా?
- ఈనాడు నిజం డబ్బుకు అభివృద్ధి ఫలితాలు, ఆధునిక సౌకర్యాలు ప్రజలకు అందక పోవటానికి కారణాలేమిటి? నిజం డబ్బుకు అభివృద్ధి ఫలితాలు, ఆధునిక సౌకర్యాలు అందక పోవటం నిజమైన అభివృద్ధికి చిహ్నమా?
- అభివృద్ధికి చిహ్నం ఆడంబరాలేనా? అంతర్యం గీటురాయి కదా? 60 సంవత్సరాల నుండి అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ఏన్నో కోట్లాది కోట్ల రూపాయలు ఖర్చు అయినా ఇంకా సమాజంలో పెద్ద వెలితి ఈనాటికీ కనపడటానికి కారణాలేమిటి?
- అక్రమార్జన లేని అభివృద్ధి సాధ్యం కాదా? అభివృద్ధి అంటే శాశ్వతంగా అక్రమార్జన పరుల రాజ్య కొనసాగించటమేనా?
- ప్రతి వారికి మంచి నీరు, పౌష్టికాహారం ఆరోగ్యం, విద్య వసతి సౌకర్యాలు అందుతున్న విషయాన్ని గురించి, అభివృద్ధికి ప్రధాన రంగాలైన సాగునీరు, తాగునీరు, కరెంటు, రోడ్లు, రవాణాలు, విద్య, వైద్యం, ఉపాధికల్పన, పరిసరాల పరిశుభ్రత, వినోదం, విశ్రాంతి, వేడుకలు, క్రీడలు మొదలైన విషయాలలో, ఈనాటికి జరిగిన అభివృద్ధి సమీక్షించుకోవలసిన అవసరం లేదా?
- అభివృద్ధి అంటే అంతరాలు పెంచటమేనా? ఇదేనా ప్రజాస్వామ్య వ్యవస్థ లక్షణం?
- **ప్రజాస్వామ్యం పాలన అంటే ఫ్యూడల్, రాచరిక, జమిందారీ, భూస్వామ్య వ్యవస్థల స్థానములో, ఆధునిక అక్రమార్జన పరుల రాజ్యం స్థాపించటమేనా?**

# సమాజంలోని అక్రమార్జన విషసంస్కృతిని అదుపు చేయాలి

నేటి సమాజంలో తీవ్రమైన సమస్య అక్రమార్జన సంస్కృతే. ఈనాటి ప్రజాస్వామ్య వ్యవస్థ పేరుతో వున్న ఈ సమాజములో అక్రమార్జన సంస్కృతి ప్రభావం అంతా ఇంతా కాదు.

రాష్ట్ర ప్రభుత్వం, నక్సలైట్ల మధ్య చర్చలు, రాజీ ప్రయత్నాలు హర్షించదగిన విషయమే

ప్రజాస్వామ్య వ్యవస్థలో హింసకు తావుండకూడదనేది నిజమే. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలి అనేది నిజమే.

నక్సలైట్లను ఆయుధాలను వదలి జన జీవనములో కలపమంటున్నారు. హర్షించదగ్గ సూచనే.

జన జీవనములో వుంటున్న అక్రమార్జన పరుల హింసా విధానాలను, అరి కట్టటానికి ప్రభుత్వ తగిన శ్రద్ధ చూపటంలేదని ప్రజలు భావిస్తున్నారు. మరి దాని సంగతేమిటి?

సమాజంలో అక్రమార్జన పరులు హింసను పెంచుతున్నారు. ప్రజలలో అభద్రతా భావము కలిగిస్తున్నారు. బతుకు ఖరీదు పెంచుతున్నారు. కల్తీలను, నకిలీలను పెంచుతున్నారు. నాణ్యతలేని పనులను చేసి ప్రజాధనమును దోచుకుంటున్నారు. ప్రజలపై పన్నుల భారం పెరగటానికి పరోక్షంగా కారకులవుతున్నారు. ఇలా చెప్పకుంటూపోతే అనేక సమస్యలకు మూల కారణం అక్రమార్జన సంస్కృతే, అక్రమార్జన పరులే.

అక్రమార్జన పరులు చేసే అన్యాయాల, అక్రమాల మీద, ప్రజలు ఎదురు తిరగకుండా అక్రమార్జన పరులు ప్రైవేటు సైన్యాలను, అరాచక శక్తులను పెంచి పోషిస్తున్నారు.

సమాజంలో శాంతి, భద్రతల విఘాతానికి కూడా కారణం అక్రమార్జన పరులే.

సామాజిక వాతావరణాన్ని కలుషితం చేస్తున్న అక్రమార్జన సంస్కృతిని, పాలకులు ఎలా అరికడతారో సామాన్యుడికి అర్థంకాని విషయముగా మిగిలినది.

నక్సలైటు సమస్యతో పాటు, ప్రజలకు హాని కలిగిస్తున్న అక్రమార్జనపరుల సమస్యను కూడా పరిష్కరించాలని సామాన్య ప్రజలు కోరుతున్నారు.

**నక్సల్స్‌ను ఆయుధాలు సరెండర్ చేయమన్నట్లుగా, సమాజాన్ని పీడిస్తూ అనేక సమస్యలు సృష్టిస్తున్న అక్రమార్జన పరుల అక్రమార్జనను కూడా సరెండర్ చేయించే మార్గాల గురించి, ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.**

ఈనాటి సమాజంలో అన్ని రంగాల మీద అక్రమార్జన సంస్కృతి చెడు ప్రభావం కనపడుతూనే వున్నది.

సమాజంలో అక్రమార్జన సంస్కృతిని అరికట్టితేనే శాంతియుత వాతావరణము నెలకొల్పబడే మాట నిజం.

ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడేది, నీతికి, నిజాయితీకి, నిజానికి, న్యాయానికి, ధర్మానికి బలము చేకూరేది సమాజంలో అక్రమార్జన సంస్కృతి లేనప్పుడే.

న్యాయమైన ఎన్నికలు, నిజమైన ప్రజా ప్రభుత్వాలు ఏర్పడేది కూడా అక్రమార్జన సంస్కృతి లేనప్పుడే.

అక్రమార్జన సంస్కృతి సమాజములో వున్నంతవరకు సామాన్య జనానికి అన్నీ కష్టాలే.

సమాజములో ప్రజలు ఎదుర్కొంటున్న 80 శాతం సమస్యలు అక్రమార్జన సంస్కృతి మూలంగానే.

ప్రజా ప్రభుత్వాలు నేటి సమాజములోని అక్రమార్జన సంస్కృతిని అదుపు చేసే చర్యలు తీసుకుంటే ప్రజా సమస్యల పరిష్కారానికి చక్కని బాట ఏర్పడుతుంది.

అక్రమార్జన సంస్కృతిని అరికట్టడానికి ఈనాటి ప్రభుత్వాలు వెంటనే పూనుకోవాలి.

## ఈనాటి ప్రజాస్వామ్య పాలనలో - పాలక వర్గాలు అక్రమార్జన - అక్రమార్జన సంస్కృతి - ఫ్యూడల్ భావజాలం ఉద్యమాలు.

ఈనాటి సమాజంలో, సామాన్య ప్రజలు చేసే ఉద్యమాలు, అక్రమార్జనపరుల ఉద్యమాలతో, పోటీ పడలేకపోతున్నాయి.

ఒకనాడు అవసరాల కోసం సామాన్య ప్రజలు చేసే ఉద్యమాలు, బలంగా ఉంటాయనుకునేవారు.

కాని, ఈనాడు అక్రమార్జన నెలకొన్న సమాజంలో అక్రమార్జన పరులు చేసే ఉద్యమాలే బలంగా వున్న మాట వాస్తవం.

ఈనాటి పాలక వర్గాలు ప్రత్యక్షంగా, సామాన్య జనం గురించి నినాదాలు, వాగ్దానాలు చేసినా పరోక్షంగా అక్రమార్జన పరులకే అండగా వున్న మాట నిజం. దానికి కారణం, ఏ పార్టీ పాలక వర్గాలైనా, ఎన్నికల్లో గెలిచేది. అక్రమార్జన పరుల బలంతోనే.

సమాజంలో అక్రమార్జన పరులు, అలవాట్లకు లోనైనవారిని, అల్లర్లు సృష్టించే శక్తి వున్నవారిని పెంచి పోషిస్తున్న మాట వాస్తవం.

ఏ యుగంలో అయినా, ఏ సమాజంలో అయినా బలమే ప్రధానం, ఆ బలమైన లాబీల అండదండలతోనే, పాలక వర్గాలు ఏర్పడేది. అందకే పాలక వర్గాలకు ఎప్పుడూ బలమైన శక్తిగల లాబీల వారంటేనే ఇష్టం. (అమ్రార్జనపరులే బలమైన లాబీలను సృష్టించగలరు).

ఆనాటి రాజుల పాలనకు, బలమే ప్రధానం, ఈనాటి ప్రజాస్వామ్యపాలనకు, బలమే ప్రధానం, సామాన్య ప్రజలు, వారి

లాబీని బలంగా పెంచుకోలేకపోతున్నారు. అందుకే వారంటే పాలక వర్గాలకు చులకన, తేలిక భావం.

ఎన్నికల, ఓట్ల ప్రక్రియలో అక్రమార్జన ప్రభావమే అధికం. అక్రమార్జనే సమాజంలో అలవాట్లు పెంచేది, హింసను పెంచేది, విలువలను చంపేది.

జనాభా రీత్యా అవసరాలతో సతమతమవుతున్న జనం ఎక్కువగా వున్నా, వారందరూ కలసి బలంగా పోరాడలేకపోతున్నారు. నేటి సమాజంలో అక్రమార్జన పరులే, బలమైన శక్తిగా వున్న మాట నిజం.

మన ప్రజాస్వామ్య పాలనలో, ఫ్యూడల్ భావజాల పరిపాలన సాగుతున్న మాట నిజం.

**అక్రమార్జనపరులు బలమైన శక్తిగా, పదునుగల శక్తిగా, సమాజాన్ని శాసించే శక్తిగా, సమాజాన్ని అదుపుజేసే శక్తిగా నేడు ఎదిగినమాట వాస్తవం. అవసరాల కోసం పోరాడే ఉద్యమాలను బలహీన పరచగలిగే శక్తి అక్రమార్జన పరులకే వున్న మాట వాస్తవం.**

**నవ్వుతూ మాట్లాడుతూ, కఠినంగా, క్రూరంగా, వ్యవహరించే శక్తి, యుక్తి, కనపడకుండా అణగదొక్కే స్వభావం, అక్రమార్జన పరులకు, అక్రమార్జన సంస్కృతికి వుండే లక్షణం.**

అక్రమార్జన పరులు, పెంచి పోషిస్తున్న అక్రమార్జన సంస్కృతే, సమాజంలో భయాన్ని పెంచుతుంది.

అభద్రతా భావాన్ని కలుగచేస్తుంది. అన్యాయాల మీద, అక్రమాల మీద తిరగబడే శక్తి లేకుండా చేస్తుంది.

సామాన్య ప్రజలను ఆధునిక బానిసలుగా మారుస్తుంది.

అలవాట్లు వారిని, అరచకాలు సృష్టించడానికి వాడుకుంటుంది.

అనవసర ఉద్యమాలకు ప్రోత్సాహాన్నిస్తుంది.

ప్రతివారిని అక్రమార్జన లేనిదే బతకలేని స్థితికి దిగజారుస్తుంది.

అక్రమార్జన సంస్కృతిని విమర్శించకుండా అణిచివేస్తుంది.

సామాన్య జనాన్ని పక్షవాత రోగులుగా మెలిగేటట్టు చేస్తుంది.

సమాజంలో అవసరాలను, అలవాట్లను పెంచి పోషిస్తుంది.

వనరులను అందీ అందకుండ ఆడిస్తుంది.

అవసరాల ఉద్యమాలను బలహీనపరచి, అలవాట్లు ఉద్యమాలకు బలం చేకూరుస్తుంది.

ఎన్నికలు ఓట్ల తంతులో పెత్తనం అంతా తన చేతులలోకి తీసుకొంటుంది.

**అక్రమార్జన పరులు, శాశ్వతంగా రాజ్యం ఏలుకునే పరిస్థితి, సమాజంలో నేడు కల్పించింది అక్రమార్జన సంస్కృతే.**

వెనుకటి రాజుల, జమిందారుల వ్యవస్థకన్నా, నేడు ప్రజాస్వామ్యం పేరుతో సాగుతున్న పాలనలో, పాలకవర్గాలలో, ఫ్యూడల్ భావజాలం బలమైన స్థానాన్ని నిర్మించుకుంది. ఈ ప్రజాస్వామ్యంలో నూతన రూపంలో ఫ్యూడల్ భావజాల వ్యవస్థను కొనసాగించుకుంటున్నది.

**నేటి అక్రమార్జన పరులు, వెనుకటి ఫ్యూడల్ నియంతలకు లేని తెలివితేటలతో, కుట్రలతో, ఎత్తుగడలతో పల్లెటూర్లనుండి, పట్టణాలలోని వార్డుల వరకు అనుచర వర్గాలను, ఫ్యూడల్ భావజాలాన్ని**

**పెంచి పోషిస్తున్నారు. నేటి పాలక వర్గాలు, సామాన్య ప్రజల అవసరాలకన్నా, అక్రమార్జన పరుల ప్రయోజనాలు కాపాడటమే ప్రథమ కర్తవ్యంగా పెట్టుకున్నారు.**

అక్రమార్జన సంస్కృతి, అభ్యుదయ శక్తులను అణగద్రొక్కినది.

అభ్యుదయ భావజాలాన్ని అడుగంటిపోయేటట్లు చేసింది.

మానవ విలువల్ని మంట కలిపింది.

అవసరాలకు, అలవాట్లకు పరుగు పందాలు పెట్టింది.

ప్రజలను నిత్య జీవితంలో వురుకులు, పరుగులు తీయిస్తుంది.

పాలన సంగతి, పాలకుల సంగతి గురించి లోతుగా ఆలోచించకుండా, పట్టించుకోకుండా, ప్రజలను దూరం చేసింది.

అన్యాయాలు, అక్రమాలు, కళ్ళముందు కనపడుతున్నా, మనస్సుకు పట్టని స్థితిని, పట్టించుకోలేని పరిస్థితిని కల్పించింది.

జనంలో నిరాశ, నిస్పృహలను, భయాన్ని పెంచింది.

అందరూ దొంగలనే భావన కలగజేసింది.

పూర్వపు పాలక వర్గాలు, వారి అక్రమార్జనను ప్రశ్నించకుండా, ప్రజలను ఇహలోకం, పరలోకం, భక్తి మార్గంలో, అదృష్టాల, దరదృష్టాల కథలతో, ముక్తి మార్గంలో ముంచెత్తితే, నేటి అక్రమార్జన పరులు, పై మార్గాలతో పాటు, ప్రజలను మత్తులతో, మైకాలతో, మోసాలతో, మాయలతో, లాటరీలతో, ఛాన్సులతో, కత్తులతో, బాంబులతో, భయాలతో ముంచుతున్నారు. కిరాయి రాక్షస సంస్కృతితో, ప్రజలను భయపెడుతున్నారు.

నేడు సమాజాన్ని పట్టి పీడుస్తున్న పెద్ద జబ్బు ఈ అక్రమార్జనే, దానికి వెంటనే వైద్యం చేపట్టాలి. ఇప్పటికే ఆలస్యం అయ్యింది. అందుకు ప్రజా వైద్యులైన రచయితలు, అక్రమార్జన సంస్కృతి ఏ ఏ రంగాల మీద ఎలా విష సంస్కృతిని విస్తరింపజేస్తున్నది, దానివలన జరుగుతున్న పరిణామాలను, నాటికల ద్వారా, నాటకాల ద్వారా, కవితల ద్వారా, రచనలు చేసి ప్రజలకు అందజేయాలని విజ్ఞప్తి.

సమాజంలో శాంతి కావాలనే వారు, భద్రత కాపాడబడాలనే వారు, ప్రశాంతత కోరుకునే వారు. న్యాయం, ధర్మం, సత్యం కాపాడబడాలని కోరుకునేవారు, భారతీయ సంస్కృతిని కాపాడబడాలని కోరుకొనేవారు అక్రమార్జన సంస్కృతిని గురించి ఆలోచనలు కొనసాగించి, చర్చాగోష్టులు నిర్వహించి అక్రమార్జన సంస్కృతిని తొలిగించడానికి పరిష్కార మార్గాలను అన్వేషించ వలసిందిగా సామాజిక స్పృహ గల ఆలోచనా పరులందరికి మనవి.

# నీతి

## రేడియో ప్రసంగం

నీతి సమాజానికి మూల స్థంభంలాంటిది. నీతి అంటే ఒక నియమం. ఒక నిబంధన, ఒక కట్టుబాటు. నీతి మానవ సమాజ నడకకు మార్గదర్శకం. వ్యక్తుల మధ్య సహజీవనానికి నీతి చుక్కాని వంటిది.

నీతిలేని మానవ సమాజం, మానవ సమాజం కానే కాదు. ఒక మృగ సమాజం అవుతుంది.

వ్యక్తుల సమూహమే సమాజం.

వ్యక్తుల మధ్య, వ్యక్తి – సమాజం మధ్య నిత్య జీవిత సంబంధ బాంధవ్యాలు సజావుగా సాగటానికి, సమాజం ఒక పద్ధతిగా నడవడానికి ప్రవేశపెట్టిన నియమాలూ, నిబంధనలే నీతులు.

అనాదిలో ప్రజా ఆలోచనా వరులైన ఋషులు నీతిని ప్రభోదించారు. సమాజాన్ని అదుపుచేసే పాలక వర్గాలు, సమాజంలో నీతిని అమలు చేశారు. సంరక్షించారు. ఆనాటి ఋషులు, పాలక వర్గాలు సమాజంలో నీతిని నిలబెట్టటానికి ఆధ్యాత్మిక చింతనను బహుళంగా ప్రచారం చేశారు.

మానవ సమాజం గుంపులుగా జీవించే దశనుండి నేటి వరకూ, ఏదో ఒక రూపంలో ఈ నీతి సూత్రాల ప్రభావం సమాజంపై వుంటూనే వుంది.

మానవ సమాజ పరిణామ క్రమంలో మానవ జీవన విధానానికి సంబంధించిన వివిధ రంగాలకు అనుగుణంగా రాజనీతి, అర్థనీతి,

దండనీతి, లైంగికనీతి, సాంఘికనీతి ఇలా అనేక శాఖలుగా నీతి విస్తరించింది.

మానవ సమాజం క్రమ పద్ధతిలో సాగడంలో అర్థనీతి, రాజనీతి, దండనీతి ప్రధాన పాత్ర వహిస్తాయి.

నీతిని సమాజంలో బలవంతంగా నిలబెట్టలేము. సమాజ అవసరాలు – వనరుల మధ్య వుండే సంబంధ బాంధవ్యాలే సమాజంలో నీతిని నిలబెట్టటానికి ముఖ్య కారణాలవుతాయి.

నీతి లేని సమాజం అనేక ఘర్షణలకూ, అన్యాయాలకూ, అక్రమాలకూ నిలయంగా మారుతుంది. సమాజాన్ని సక్రమంగా నడిపించడానికి నీతి తప్పనిసరి. నీతి అనేది ఒకనాటి ఋషుల మాటగా, రాజుల మాటగా, కథల రూపంలో, పురాణాల రూపంలో వినపడతూ వచ్చింది.

ఈనాటి ప్రజాస్వామ్య ప్రభుత్వాల అధ్వర్యములో నీతి, చట్టాల, శాసనాల రూపంలో కనపడుతున్నది.

అనాది నుండి నేటివరకూ ఏ పాలకులైనా సమాజాన్ని నడిపించడానికి నీతే మూలాధారం, పాలనకు, సమాజ జీవితానికి, నీతికి విడదీయరాని సంబంధం వున్న మాట నిజం.

నీతిలేని నాడు ఈ సమాజం అయోమయం. అశాంతి, అభద్రతా భావంతో సతమతమౌతుంది. రోగగ్రస్తం అవుతుంది. అక్రమార్జన పరులే ఈనాటి సమాజాన్ని నీతికి, విలువలకు దూరం చేస్తున్నారు.

రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాలన్నింటి లోనూ అక్రమార్జన సంస్కృతి పెరిగి పోతున్నది. నేటి సమాజం నీతిని వదిలి అక్రమార్జన సంస్కృతిలో మగ్గిపోతున్నది.

సమాజం ఎదుర్కొంటున్న ఈ అవినీతిమయమైన పరిస్థితిని తొలగించడానికి ప్రజలే పూనుకోవాలి. ప్రజలు అందుకు పూనుకోక పోతే సమాజం పక్షవాతపు రోగిలా మారే మాట నిజం.

సమాజములో నీతిని పెంపొందించి నిలబెట్టడానికి అవసరాలు–వనరుల మధ్య సమతుల్యం కాపాడబడాలి.

సమాజంలోని అక్రమార్జన సంస్కృతిని అరికట్టాలి. సమాజంలో నీతి కాపాడబడటంలో రాజనీతి, అర్థనీతి, దండనీతి ప్రధాన పాత్ర వహించాలి.

కేవలం, గురువుల, పూజారుల, స్వాముల మూలంగానే నీతి సమాజంలో నిలబడలేదు.

ప్రజలు, పార్టీలు, పాలక వర్గాలు నీతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అప్పుడే సమాజంలో నీతి నిలబడుతుంది. పరిపాలన సజావుగా సాగుతుంది. ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రజా సంక్షేమం మెరుగవుతుంది.

# నిజాయితీ

## రేడియో ప్రసంగం

నిత్య జీవితంలో ఏదో ఒక సందర్భంలో ప్రతివారు నీతి, నిజాయితీ అంటూ ఉంటారు. నీతితో కూడిన నడతనే నిజాయితీ అంటాము. మనిషి ఏ తప్పు చేయకుండా నీతికి, న్యాయానికి, ధర్మానికి కట్టుబడి నడచుకోవడమే ఆ మనిషి నిజాయితీకి చిహ్నం, నిజాయితీ, మనిషి ప్రవర్తనకు కొలబద్ద. వ్యక్తిత్వానికి వన్నె తెచ్చేది నిజాయితీయే. మానవ సమాజానికి నిజాయితీ గీటురాయి.

నిజాయితీతో కూడిన అభివృద్ధి కార్యక్రమాలు సమాజానికి మేలు చేసే మాట నిజం. ఏ దేశ అభివృద్ధి అయినా నిజాయితీ మీదే ఆధారపడి ఉంటుంది. నిజాయితీ లేని అభివృద్ధి పథకాలు ప్రమాదాలకు దారితీసే మాట నిజం. నిజాయితీతో కూడిన నాయకత్వం సమాజానికి దిక్సూచి లాంటిది.

నిజాయితీ క్రమశిక్షణతో కూడుకున్నది. బాధ్యతతో వ్యవహరించడం దాని ప్రత్యేకత. కష్టపడే తత్వం నిజాయితీకి రాణింపు.

నిజాయితీ లేని సమాజం కష్టాల పాలవుతుంది. చిరాకులతో జీవించవలసి వస్తుంది. నిజాయితీ అన్ని రంగాలలో కాపాడబడాలి. అలా కాపాడబడినప్పుడే మానవసమాజ మనుగడ సంతోషంగా సాగేది.

నేడు మనదేశంలో నీతి, నిజాయితీ నీరసిస్తున్నవి. బలహీన పడుతున్నవి నిజాయితీ నష్టపోతున్నది. నిజాయితీకి మారుపేరు **"పిచ్చితనం"** అని పేరు పెట్టారు కొంతమంది స్వార్థపరులు, అన్ని రంగాలలో నిజాయితీ కరువౌతున్నది.

ఆధ్యాత్మిక రంగం, రాజకీయ రంగం, ఆర్థిక రంగం, వ్యాపార రంగం, సాంఘిక రంగం, సాంస్కృతిక రంగం, కాంట్రాక్టుల రంగం చివరకు మన దేశాన్ని రక్షించే రక్షణశాఖ రంగం, అన్ని రంగాలలోను నిజాయితీ లోపిస్తున్నది. ఎక్కడ చూసినా సమాజాన్ని ఆవరించింది ఈ కాలుష్యం.

ఈ అక్రమార్జన సంస్కృతి వెదజల్లుతున్న కాలుష్యంలో, నిజాయితీ జనంలో బతకలేక పోతున్నది. నిలువలేకపోతున్నది. నిజాయితీ లేకుండా సమాజం ఆరోగ్యంగా బతకలేదు. నిలువలేదు. అదే ఈనాటి సమాజ స్థితి.

నిజాయితీ లోపించబట్టే నేటి సమాజం అరాచకాలకు, అల్లర్లకు, ఆగడాలకు, అభద్రతా భావనకు నిలయంగా మారింది. కష్టాలు, కల్తీలు, నకిలీలు ఎక్కువైనాయి. సమాజ మనుగడకు పనికివచ్చే ఏ వస్తువైనా నాలుగు కాలాలపాటు మన్నికగా ఉండకుండాపోతున్నది.

ఇటీవల కాలంలో నివాస భవనాలు కూలి, లక్షలాదిమంది చనిపోయిన విషయానికి **"నిజాయితీ"** లేని నిర్మాణాలే కారణం అనేది అందరికి తెలిసిన సత్యం. ప్రభుత్వం కూడా అంగీకరించిన మాట నిజం. కాబట్టి **"నిజాయితీ"** లేని సమాజం ఎన్ని రకాల ప్రమాదాలకు గురౌతుందో ఊహించలేము.

నిజాయితీ లేని స్థితిలో నేటి సమాజం, తూలిపోతున్న జబ్బుతో, వాలిపోతున్న జబ్బుతో బాధపడుతున్న సంగతి కొంతమందికే తెలుసు. ఈ జబ్బులకు ప్రజాక్షేమం కోరే ప్రజలు, పార్టీలు, ప్రభుత్వాలు వెంటనే వైద్యం చేపట్టాలి.

మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీలు, బాబాలు సమాజంలో నిజాయితీ పెంచడానికి ప్రయత్నం చేయాలి.

స్వార్థపరులు పెంచి పోషిస్తున్న అక్రమార్జన సంస్కృతే నీతికి, నిజాయితీకి తావులేకుండా చేస్తున్నది. ఆధ్యాత్మిక రంగంలోని పెద్దలు, రాజకీయ రంగంలోని పెద్దలు, అక్రమార్జనపరులను, అక్రమార్జన సంస్కృతిని వారి దరిచేరనీయకుండా గట్టి చర్యలు చేపట్టాలి.

సమాజ మనుగడకు, పాలనా సౌకర్యానికి, సమాజం సంక్షేమానికి నీతి, నిజాయితీ ఎంతో ముఖ్యావసరం.

అందుకు మనందరం నీతి, నిజాయితీ గల సమాజ నిర్మాణం కోసం పాటుపడాలి.

సమాజములో నీతి, నిజాయితీ బలం పుంజుకున్ననాడే సమాజానికి మోక్షం.

# అభివృద్ధి కార్యక్రమాలు, అక్రమార్జనకు సోపానాలా...?

మన దేశములోని అభివృద్ధి కార్యక్రమాలు 50 సంవత్సరాలుగా అమలు జరుపబడుతూనే వున్నాయి. ఆ అభివృద్ధి ఫలితాలు, ఆధునిక సౌకర్యాలు నిజం డబ్బుకి అందడంలేదు.

కొన్ని సౌకర్యాలు మెరుగైన మాట నిజమే కానీ, దానితోపాటు సామాన్య జనం బతుకు ఖరీదైపోయింది. అభివృద్ధికి చిహ్నం, సామాన్య ప్రజలకు అభివృద్ధి ఫలితాలు, ఆధునిక సౌకర్యాలు వారి ఆదాయ పరిధిలో లభించడం అభివృద్ధికి చిహ్నం. అభివృద్ధికి చిహ్నం ఆడంబరాలు కాదు, ఆంతర్యం గీటురాయి. ప్రజలకు బతుకు భయం. భవిష్యత్ అంటే భయం లేకుండా వుండడం. దిగుల్లేని జీవితం గడపడం. అభివృద్ధి కార్యక్రమాలకు గీటురాయి, సామాన్య ప్రజల జీవన ప్రమాణం అన్ని సౌకర్యాలలో పెరగడం. అంటే ముఖ్యంగా ఆహార రంగములో, నివాసపరంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, ఆరోగ్యపరంగా, రవాణా సదుపాయాలలో, సాంఘికంగా, సాంస్కృతికంగా మెరుగు కావడం.

అభివృద్ధి కార్యక్రమాలు పెరుగుతున్నకొద్దీ ఆర్థిక వ్యత్యాసాలు విపరీతంగా పెరుగుతున్నాయి.

ఆర్థిక వ్యత్యాసాలను పెంచేది నిజమైన అభివృద్ధికాదు.

సమాజంలో శాంతిభద్రతలు క్షీణించడం అభివృద్ధికి చిహ్నంకాదు. అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నకొద్దీ జనం

అనుభవించే సౌకర్యాలలో పెద్ద అగాథం ఏర్పడుతున్నది. అధిక ధరల పెరుగుదలకు దోహదం చేస్తున్నది ఈ అభివృద్ధి కార్యక్రమాలు. ఈ అభివృద్ధి కార్యక్రమాల వలన కొద్ది శాతం మంది ఎంతో లాభపడినా, ఎక్కువ శాతం మంది అసంతృప్తితో కనిపిస్తున్నారు.

అదుపులేని అభివృద్ధి కార్యక్రమాల ముసుగులో అక్రమార్జన అంతులేకుండా పెరిగిపోయింది. అక్రమార్జనే అభివృద్ధి ఫలితాలు, అధునిక సౌకర్యాలు అందరికీ అందకుండా కాటేస్తున్నాయి. ఏ సమాజమయినా అక్రమార్జనను, అధిక జనాభాను అరికట్టకపోతే, ఆ సమాజానికి మోక్షంలేదు. అక్రమార్జనకు తావులేని అభివృద్ధి కార్యక్రమాలు సమాజానికి కావాలి.

అక్రమార్జన సంస్కృతి హింసా, దౌర్జనాలు, అరాచకాలు, అల్లర్లు పెరిగి పోతున్నాయి.

ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మయిన ఎన్నికల రంగం అంతా అక్రమార్జనపరుల ఆటగా మారింది.

అన్ని రాజకీయ పార్టీలు, అక్రమార్జన పరులమీదే ఆధారపడుతున్నాయి. సమాజములో నేడు ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు మూలం అక్రమార్జనే.

అన్ని రంగాల మీద అక్రమార్జన ప్రభావం కొట్టొచ్చినట్లు కనపడుతున్నది.

జన్మభూమి, పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాల మాదిరిగా, పెద్దయెత్తున మన ప్రభుత్వాలు, అక్రమార్జనను అరికట్టే కార్యక్రమాలు

చేపట్టాలి. ఆ అక్రమార్జనను అరికట్టే చర్యల మూలంగానే అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు, నిజంగా ప్రజలకు అందేది.

అక్రమార్జన సంస్కృతిని రూపుమాపే కార్యమాలలో ప్రజలూ, పార్టీలు, పాలకవర్గాలు, పాలన సిబ్బంది పెద్దయెత్తున పాల్గొనాలి. అప్పుడే సమాజానికి మోక్షం. ప్రజాస్వామ్యానికి బలం. అటువంటి కార్యక్రమాల మూలంగానే అభివృద్ధి కార్యక్రమాలు, అక్రమార్జనకు సోపానాలు కాకుండా వుండేది.

# ఎన్నికలు - అక్రమార్జన సంస్కృతి

ఎన్నికలనగానే ఒక జాతర వాతవరణం కనపడుతుంది నేడు. మంచి ఆలోచనలతో సమాజాన్ని తీర్చిదిద్దటానికి. సమాజ జీవితాన్ని ప్రశాంతంగా సౌకర్యంగా కొనసాగించడానికి, ఆ కర్తవ్యాన్ని నిర్వహించటానికి ఒక పాలక వర్గాన్ని ఎన్నుకోవటం అనేదే ఎన్నికల ప్రక్రియ.

కాని నేడు ఎన్నికల ప్రక్రియ వికృత రూపం దాల్చింది. జూదంలాగా మారింది. అరాచక శక్తుల ఆటగా మారింది. ఎన్నికల రంగంపై, కనపడకుండా అక్రమార్జన పెత్తనం చేస్తుంది. అన్ని రాజకీయ పార్టీల మీద అక్రమార్జన ప్రభావమే.

సమాజ సంక్షేమం మాటల వరకే పరిమితం. ఎన్నికలు, చట్టసభలు, పరిపాలన ఒక వ్యాపారం అయిపోయింది. అందుకే అక్రమార్జన పరుల రాజకీయ పార్టీలలో ప్రముఖ పాత్ర వహిస్తున్నారు. ఎన్నికలలో జరిగే అన్ని చెడులకు కారణం అక్రమార్జనే. ఈ అక్రమార్జన ప్రభావమే ఎన్నికలలో అరాచకము, అలజడి, భయపెట్టడము, హత్యలు, రిగ్గింగ్ కొనసాగుతున్నది.

అక్రమార్జన ప్రభావంతో జరిగే ఎన్నికల ప్రక్రియ వల్ల ఏర్పడే చట్ట సభలూ, పాలక వర్గాలూ, ప్రజా ప్రయోజనాలను కాపాడలేవు. ఎన్ని ఎన్నికల సంస్కరణలు వచ్చినా అక్రమార్జన ప్రభావమును అరికట్టకపోతే ప్రయోజనం లేదు.

అక్రమార్జన సంస్కృతి సమాజాన్ని నేరమయం చేసింది.

సమాజాన్ని బలహీనపరిచింది.

ఒక రకంగా సమాజాన్ని ఆధునిక బానిస వ్యవస్థలోకి తీసుకువెళ్ళింది.

అక్రమార్జన ఆగడాల మీద తిరుగబడే శక్తి లేకుండా చేసింది.
అవసరాలు పెంచింది.

వనరులు అందీ అందకుండా చేస్తున్నది.

ప్రతివారిని ఎప్పుడూ వనరుల వెతుకులాటకే పరిగెత్తిస్తున్నది.

బతుకు ఖరీదు పెంచింది.

సామాన్య జనంలో ఐక్యతను విధ్వంసం చేసింది.

విలువలను చంపింది. హింసను పెంచింది.

ప్రజలలో, ప్రతి ఒక్కరిలో తన గురించే గాని, చుట్టువున్న సమాజాన్ని గురించి ఆలోచించే తీరిక, ఓపిక లేకుండా చేసింది.

అన్యాయాల మీద, అక్రమాల మీద ప్రజా ఉద్యమాలు బలంగా ఎదగకుండా కనవడని **"అడ్డు"** ఏర్పరచింది.

పాలక వర్గము ఏ రూపములో వచ్చినా తమ అడుగుజాడలలో నడిచేటట్టు చేస్తున్నది.

సమాజములోని అన్ని రంగాలను శాసించే స్థితికి చేరుకుంది.

ప్రధానంగా పాలక వర్గాలను ఎన్నుకునే ఎన్నికల రంగము మీద పూర్తి ఆధిపత్యం వహిస్తున్నది.

ఈ అక్రమార్జన సంస్కృతిని సమాజములో అరికట్టే ఉద్యమాలు తిరిగి పెద్దఎత్తున మొలకెత్తకపోతే సమాజానికి భవిష్యత్తులేదు.

ఎన్ని చట్టాలు వచ్చినా ఎన్ని సంస్కరణలు తీసుకువచ్చినా ప్రజాజీవితానికి ఒరిగేదేమి లేదు.

న్యాయంగా, ధైర్యంగా కష్టపడే మనిషి, కమ్మగా బ్రతకగలిగే వాతావరణాన్ని కలగజేసే పాలక వర్గాలను ఎన్నుకునే ప్రక్రియకు, అడ్డువచ్చే అక్రమార్జన పరుల ప్రభావాన్ని అరికట్టడానికి,

**సమాజములో పెద్ద ఎత్తున అంతర్గత విప్లవం రావాలి.**

అందాక ఈ ఎన్నికల రంగము అక్రమార్జన పరులకు ఒక అధికారము పొందే ఆటగా, ప్రజలకు ఒక బూటకపు తమాషా ఆటగా ఉండే మాట నిజం.

# అవసరాలు-వనరులు-విలువలు-సంస్కృతి

"అవసరాలు–వనరులు–విలువలు–సంస్కృతి" మానవ సమాజ జీవిత ప్రయాణంలో విడదీయలేని అంశాలు.

నేటి సమాజంలో అవసరాలు, వనరుల మధ్య సమతుల్యం దెబ్బ తిన్నది. అవసరాలకు సరిపడే వనరులు సగటు మనిషికి అందటం లేదు. మెజారిటీగా ఉన్న సామాన్య జనం అందుకే నిరుత్సాహంతో, నిస్పృహతో. నిరాశతో, ఒక రకమైన అలజడి, ఆందోళనలతో జీవిస్తున్నారు.

అక్రమార్జన వ్యాపార సంస్కృతి, సమాజంలో అవసరాలను అలవాట్లను విపరీతంగా పెంచింది. వనరులు మాత్రం కొంతమంది చేతుల్లో బందీ అయినవి. విలువలను అతిక్రమించిన వారే, వనరులకు అధిపతులవుతున్నారు. వనరులమీద ఆధిపత్యం వారిదే. రాజకీయాల మీద ఆధిపత్యం వారిదే. ఆధ్యాత్మిక రంగం మీద కూడా వీరి పెత్తనమే. ఇక విలువల ఉనికి ఎలా సాధ్యం. విలువలు లేని సంస్కృతి మన కళ్ళ ముందు నాట్యం చేస్తున్నది. విలువలు లేని బలమైన విషసంస్కృతి మన సాంస్కృతిక రంగాన్ని, ఆర్థిక రంగాన్ని, రాజకీయ రంగాన్ని, సాంఘిక రంగాన్ని, విద్య, వైద్య రంగాల్ని, ఆధ్యాత్మిక రంగాన్ని, సమాజంలోని అన్ని రంగాల్ని శాసిస్తున్నది.

కొంతమంది అమాయకంగా సమాజంలో నైతిక విలువలు నశిస్తున్నాయని బాధపడుతున్నారు. బాధ పడుతున్నవారు సంఖ్యా పరంగా ఎక్కువే అయినా, విలువలను చంపుతున్న అక్రమార్జన సంస్కృతి మీద దాడిచేసే శక్తి వారికి లేదు. సమాజములో అవసరాలు పెరగటానికి, వనరులు కొందరి చేతుల్లో బందీ కావటానికి, విలువలు బలహీన పడటానికి అక్రమార్జన వ్యాపార సంస్కృతే ముఖ్య కారణం.

ఈ సంక్షోభం నుండి అక్రమార్జనపరులు ప్రవేశ పెట్టిన విషసంస్కృతి నుండి సమాజాన్ని కాపాడటానికి, మేధావులైన ఆలోచనా పరులు, ఇంకా లోతుగా కారణాలు విశ్లేషించి సమాజాన్ని మంచి విలువల సంస్కృతి వైపు దారి మళ్ళించటానికి, సమాజ అవసరాలు, వనరుల సమతుల్యాన్ని కాపాడటానికి ఏ ఏ చర్యలు చేపట్టాలో ఆచరణ యోగ్యమైన అంశాలను, మార్గాలను పరిశోధించి సమాజానికి అందించ వలసినదిగా విజ్ఞప్తి.

అవసరాల స్వరూపం "నాడు – నేడు – రేపు"
అవసరాలు పెరుగుతూ వస్తున్న తీరు
అవసరాలు తీర్చుకోవటానికి అనుసరిస్తున్న, ఆధారపడుతున్న విధానాలు
వనరుల సేకరణలో వచ్చిన మార్పులు
ప్రకృతి వనరుల నుండి పారిశ్రామిక వనరుల ఉత్పత్తి దశ లక్షణాలు
అవసరాల – వనరుల మధ్య కాగితం డబ్బు పాత్ర
రాబోయే సమాజానికి వనరుల మిగులు మాట ఏమిటి
అవసరాలు – వనరుల మధ్య ఘర్షణ
అవసరాలు – వనరుల మధ్య వుండవలసిన విలువల పాత్ర
అసలు విలువలంటే ఏమిటి?
ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక విలువల వివరణ.
విలువలను అతిక్రమిస్తున్న వారెవరు?
సమాజంలో వారి స్థానం ఏమిటి?
సంస్కృతి అంటే ఏమిటి?
ఈనాటి అవసరాలు–వనరులకు, విలువలకు, సంస్కృతికి, ఉన్న సంబంధం ఏమిటి?

సంస్కృతి, విలువల ఉనికికి మూలాలేమిటి? వాటి మీద ఏ ఏ ప్రభావాలు చోటు చేసుకుంటున్నాయి.

ఇంకా, ఈ విధంగా అనేక విషయాల మీద, ప్రజా ఆలోచనా పరులు, ప్రజా రచయితలు వారి రచనల ద్వారా వారి ఆలోచనలను ప్రజలకు అందించవలసినదిగా కోరుతున్నాము.

# అక్రమార్జన విషవృక్షాన్ని పెకలించేది ఎలా?

అక్రమార్జన రక్కసిని, అక్రమార్జన సంస్కృతిని పెంచి పోషిస్తున్నది, ప్రధానంగా రాజకీయ పార్టీలలోని కొంతమంది నాయకులు, పారిశ్రామిక రంగంలోని కొంత మంది పారిశ్రామిక వేత్తలు, వ్యాపార రంగంలోని కొంతమంది భడావ్యాపారులు, వివిధ రంగాలలోని కొంతమంది కాంట్రాక్టర్లు.

రాజకీయ పార్టీలలోని కార్యకర్తలు, నాయకులు నిజాయితీగా ఉంటే అక్రమార్జన సంస్కృతి సమాజములో ఇంతగా పెరిగేది కాదు. రాజకీయ నాయకులలోని అక్రమార్జన సంస్కృతిని అరికట్టితే గాని అధికార యంత్రాంగంలోని అక్రమార్జన సంస్కృతిని అరికట్టలేము.

ముందుగా మన ఆర్థికపరమైన చట్టాలలో, ఇన్‌కమ్‌టాక్స్ యాక్ట్‌లో పెద్దమార్పులు తీసుకరావలసిన అవసరం ఉన్నది. **అక్రమార్జన పట్టుపడ్డప్పుడు ఆ అక్రమార్జనని శాశ్వతంగా ప్రభుత్వం స్వాధీన పర్చుకోవడానికి ఏ అభ్యంతరం ఉండకూడదు. అటువంటి చట్టం కావాలి.**

ముందుగా రాజకీయ పార్టీలలోని వారందరూ వారి వారి ఆస్తులు, ఆదాయాలు ప్రతి సంవత్సరం వెల్లడిచేసేట్టుగా చట్టం రావాలి. ప్రతి సంవత్సరం వెల్లడి చేసిన ఆస్తుల ఆదాయాల వివరాలను పుస్తక రూపంగా ప్రభుత్వం ముద్రించాలి. ఆ పుస్తకాలను చవక ధరకు ప్రజలకు అందజేయాలి.

అలాగే ప్రభుత్వ ఉద్యోగస్తుల ఆస్తులను, ఆదాయాలను ప్రతి సంవత్సరం పుస్తక రూపంగా ప్రచురించాలి.

ప్రతి సంవత్సరం పెరుగుతున్న ఆదాయాలు ఎలా పెరుగుతున్నది వివరణ ఇవ్వవలసి ఉంటుంది. దీన్ని చట్టపరంగా అమలు పరచడానికి చట్టాలలో మార్పు తప్పనిసరిగా చేయాలి.

ఇలా జరిగినప్పుడు ప్రజలు అక్రమార్జన పరులను ఒక కంట కని పెట్టడానికి వీలవుంతుంది. ఈ సోషల్ ఆడిట్ వలన కొంతమేరకు అక్రమార్జనను అరికట్టవచ్చును.

ప్రతి మున్సిపల్ పరిధిలో, పోలీస్ స్టేషన్ పరిధిలో, మండల స్థాయిలో ప్రజా నిఘా కమిటీలను స్వచ్ఛంధ సంస్థల సభ్యులతో ఏర్పాటు చేయాలి. స్వచ్ఛంధ సంస్థల సభ్యుల ఆస్తుల ఆదాయాలు కూడా బహిరంగంగా ప్రచురింపబడాలి.

ప్రజా నిఘా కమిటీలకు చట్టపరంగా కొన్ని హక్కులు ఇవ్వాలి. ఏ ఆఫీసులోనైనా వారు అడిగిన సమాచారాన్ని సమాచారం చట్టం ప్రకారం తప్పక ఇచ్చునట్లు ప్రభుత్వం ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ఆదేశాలు జారీచేయాలి. నిఘా కమిటీ సభ్యులకు ఐడెంటిటీ కార్డులు ఇవ్వబడాలి. ముందుగా ఈ కార్యక్రమాలు పాలకులు చేపడితే కొంతమేరకు అక్రమార్జనను అరికట్టవచ్చు.

ప్రజలు కూడా ఇటువంటి నిఘా కార్యక్రమాలకు చేయూతనివ్వాలి.

పాలకులకు నిజంగా ఈ అక్రమార్జన సంస్కృతిని సమాజం నుండి పెకలించి వేయాలనే తలంపు ఉన్నట్లయితే ముందుగా పై కార్యక్రమాలను అమలు చేయడానికి పూనుకోవలసినదిగా కోరుతున్నాము.

భవిష్యత్తులో ఆస్తులు, ఆదాయాలు ప్రతి సంవత్సరం ప్రజలకు వెల్లడిచేసే విధానాన్ని పుస్తక రూపంగా ప్రచురించే విధానాన్ని అన్ని రంగాలకు అనగా డాక్టర్లకు, ఇంజనీర్లకు, చార్టెడ్ ఎకౌంటెంట్స్‌కు, కాంట్రాక్టర్లకు, వ్యాపారస్తులకు మొదలైన బాగా ఆదాయం వచ్చే వర్గాలందరికి వర్తింపచేయాలి.

గ్రామాలలో ప్రతి కుంటుంబానికి ఉన్న ఆస్తులు, ఆదాయాలు ఆ గ్రామ ప్రజలందరూ అంచనా వేసుకోవడానికి వీలుగా ఉన్నమాట నిజం.

కాని పట్టణాలలోని ఆస్తులు, ఆదాయాలు ఎవరెవరికి ఎంతెంత ఉన్నదో ఎలా సంపాదిస్తున్నారో, ఎలా దోచుకుంటున్నారో, ఎలా దాచుకుంటున్నారో అంతు పట్టని విషయంగా మారింది.

అక్రమార్జన రక్కసిని అరికట్టే మార్గంలో ప్రతి పట్టణంలోని వారి ఆస్తుల, ఆదాయాల వివరాలను ప్రతి వారికి తెలియజేసే విధానాన్ని ప్రవేశపెట్టబడాలి.

ఎవరైనా సంపాదించుకోవడం తప్పుకాదు. కాని ఆ సంపాదన ఏ రకంగా వచ్చింది అనే విషయం ప్రభుత్వాలకు తెలియజేయాల్సిన అవసరం ఉన్నది.

ఎవరైనా వారి శక్తి సామర్థ్యాలతో పాటు ప్రకృతి, సమాజం, రాజ్యం సహకరిస్తేనే వారి సంపాదనకు వీలవుతుంది.

అటువంటప్పుడు ఆ సంపాదన వివరాలను, ఆస్తుల వివరాలను ప్రకృతిని, సమాజాన్ని కాపాడటానికి మనం ఏర్పరుచుకున్న రాజ్యానికి తప్పనిసరిగా వివరించవలసిన బాధ్యత ప్రతి పౌరుడి మీద ఉన్నది.

అక్రమార్జనను, అక్రమార్జన సంస్కృతిని అదుపుచేయటానికి పటిష్టమైన చట్టాలు, శాసనాలు చేయటానికి, శాసన సభలకు, పార్లమెంటుకు, అక్రమార్జన పరులను ఎన్నుకోకుండా, నిజమైన ప్రజాసేవకు అంకితమైన వారిని ఎన్నుకొనేవిధంగా, ఎన్నికల సమయంలో ప్రజావోటర్లు జాగ్రత్తతీసుకోవడం అవసరం.

ప్రభుత్వపరంగా చట్టసభలలో పటిష్టమైన చట్టాలు, శాసనాలు చేసి సమాజంలో ఆర్థిక పరమైన పారదర్శకతను ప్రవేశపెడితే చాలా వరకు అవినీతి వృక్షాన్ని, ఈ అక్రమార్జన సంస్కృతిని పెకలించడానికి వీలవుతుంది.

# అక్రమార్జన రూపాలు

అతి ప్రమాదకరమైన అక్రమార్జన,
ప్రమాదకరమైన అక్రమార్జన,
సమాజానికి నష్టాన్ని, కష్టాన్ని కలుగ జేస్తున్న అక్రమార్జన,
చిరాకు, చికాకు కలుగ జేస్తున్న అక్రమార్జన,
సమాజానికి ప్రమాదం లేని అక్రమార్జన,
సమాజానికి ఉపయోగపడే అక్రమార్జన

(అక్రమార్జన రూపాలపై లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరమున్నది)

ఆలోచనే మార్పుకు మూలం
ప్రదర్శన మార్పుకు బలం
పోరాటం, సహకారం మార్పుకు మార్గం
ప్రజా సమస్యలకు పరిష్కారం ప్రజల పాత్రే

.... ఉ.గో.